
ఆ రోజు రానే వచ్చింది. భాస్కరం తన ఊరు వెళుతున్న రోజు. తాను ఆ ఊర్ని వదిలి ఆరు సంవత్సరాలైంది. అందుకే త్వరగా వెళ్లి తన ఊర్ని చూడాలని అతని ఉబలాటం. అమెరికా లోని న్యూయార్క్‌లో ఫ్లైట్ ఎక్కి ముంబాయి, ముంబాయి నుంచి హైదరాబాదు, హైదరాబాదు నుంచి విశాఖ చేరుకునేసరికి రెండు రోజులు పట్టింది. విశాఖ నుంచి తన ఊరుకి టాక్సీలో బయలుదేరాడు. విశాఖ నుంచి అతను ఊరు చేరాలంటే కనీసం మూడు గంటల ప్రయాణం. భాస్కరానిది నాగావళి ఒడ్డున వుండే పల్లె. ఊర్ని చేరుకోవాలంటే ఏరు దాటాలి. యిప్పుడు కొద్ది దూరంలో బ్రిడ్జి కట్టారు గానీ దానివల్ల చుట్టూ తిరిగెళ్లాలి. అందుకే ఏటిఒడ్డుకే టాక్సీ మాట్లాడాడు. టాక్సీ స్పీడుగా పోతోంది. పచ్చటి పొలాల మధ్య నుంచి



# సింహద్వారం

వెళ్తుంటే ఎంతో హాయిగా అనిపిస్తోంది. యిన్ని సంవత్సరాల తరువాత ఈ ప్రాంతాలను చూస్తూంటే అతనికి ఒకటే ఆనందం కలుగుతోంది. అతను ఆ అమెరికా జీవన విధానం, ఆ బిజీ లైఫ్‌తో విసిగిపోయాడు. ఒక్కసారిగా ఈ పల్లెలు, ఈ వాతావరణం అతనికి ప్రశాంతత నిస్తున్నాయి.

దూరంగా విశాలమైన నీలిమేఘాలు, ఎగురుతున్న తెల్లని కొంగలు. అక్కడక్కడా శబ్దం చేస్తూ పారుతున్న పంట కాలువలు, ప్రకృతి అంతా ఆరబోసినట్లయింది. భాస్కరానికి అసహనంగా వుంది. యింకా రెండు గంటల పైగా ప్రయాణం. అతనికి తన బాల్యం గుర్తుకొస్తోంది.

రఘురామపురం ఏటి ఒడ్డున ఒదిగి వుండే పల్లె. పచ్చటి పొలాలు, పంటకాల్వలు, కొబ్బరి చెట్లతో అలరాడే అందమైన ఊరు. స్వచ్ఛమైన గాలికి, అందమైన సూర్యోదయాలకు పెట్టింది పేరు. భాస్కరం తండ్రి ఆ ఊరి ప్రెసిడెంట్. మోతుబరి రైతు. ఏభైఎకరాల మాగాణీ వున్న పెద్దకుంటుంబం. భాస్కరం పదవ తరగతి వరకు ఆ ఊరి హైస్కూలులోనే చదువుకున్నాడు. భాస్కరానికి ఎంతో మంది స్నేహితులు. వాళ్లలో రాజు, విస్సు, శేషు, గిరీ మరీ ముఖ్యులు. వీళ్లలో రాజు చాలా తెలివైనవాడు. టెన్త్‌లో ఆఊరికి స్కూలు ఫస్ట్ వచ్చాడు. రాజు వాళ్ల నాన్న ఆ ఊరి ఏటిగట్టున పడవ నడుపుతుంటాడు. అది పెద్ద ఏరు కావడంతో సంవత్సరం పొడుగునా నీరు పారుతుంటుంది. అందువల్ల చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకి ఈ పడవే ఆధారం. తన కొడుక్కి ఫస్ట్ రావడంతో యింటర్ ఎలా చదివించాలో ఆ పేదతండ్రికి అర్థం కాలేదు. కానీ తన తండ్రి జోక్యంతో రాజు యింటర్‌లో జాయిన్ అయ్యాడు. తామందరం రోజూ పడవలో ఏరుదాటి పట్నంకెళ్లి చదువుకునేవారు. రెండేళ్ల తరువాత రాజుకు యింటర్‌లో జిల్లా ఫస్టొచ్చింది. తను మామూలుగా ఫస్ట్‌క్లాసులో పాసయ్యాడు. అతనికి ఎమ్‌సెట్‌లో నూరులోపు ర్యాంకు వచ్చింది. అప్పుడు కూడా తన తండ్రి రాజు తండ్రి సూరయ్యను బలవంతంగా ఒప్పించి, రాజుని ఇంజనీరింగ్‌లో జాయిన్ చేయించాడు. తనకు ఇక్కడ ఇంజనీరింగ్‌లో సీటు రాకపోవడంతో, అన్నయ్య వేసవి శెలవులకని వస్తే, అతనితో పాటు అమెరికాకు వచ్చి స్టేట్స్‌లో ఇంజనీరింగ్‌లో జాయిన్ అయ్యాడు. తన అన్నయ్య అదే కాలేజిలో ప్రొఫెసరుగా పనిచేస్తుండడంతో సులువుగా సీటు దొరికింది. అక్కడి కాలేజిలో సీటు దొరకగానే స్టూడెంట్ వీసా మొదలైనవన్నీ త్వరగా దొరికాయి. కానీ ఖర్చు మాత్రం 30 లక్షలు దాటింది. తర్వాత ఎమ్మెస్ కూడా పూర్తిచేసి ఒక మల్టీనేషనల్ కంపెనీలో జాయిన్ అయ్యాడు. అప్పటికి తన ఊరు విడిచి ఆరు ఏళ్లు అయ్యింది. ఉద్యోగం వచ్చిన తరువాత భాస్కరానికి తన ఊర్ని, తల్లిదండ్రుల్ని, స్నేహితులందర్నీ చూడాలనిపించింది. యిప్పటికది సాధ్యపడింది.

**గన్నవరపు నరసింహమూర్తి**

ఆలోచనల్లోంచి తేరుకున్నాడు భాస్కరం. యింకా తన ఊరు చేరడానికి గంటన్నర పడుతుంది. ఆరు సుదీర్ఘమైన సంవత్సరాల తరువాత తన ఊరు వెళ్తున్నాడు. అతనికి చాలా ఉద్వేగంగా వుంది. అమెరికాలో ఉన్నన్నాళ్లు తన ఊరి గురించిన ఆలోచనలే... తన ఫ్రెండ్సందరూ ఏంచేస్తున్నారో? వాళ్ల కబుర్లేవీ తెలిసేవికావు. తన అన్నయ్య కూడా ఏమీ చెప్పేవాడు కాదు మొదట్లో ఏవో ఒకటి రెండు ఉత్తరాలు వచ్చినా, క్రమేపీ అవీ ఆగిపోయాయి.

చివరకెలాగైతేనేం టాక్సీ ఏటి ఒడ్డుకి చేరింది. అప్పటికి సాయంత్రం నాలుగైంది. టాక్సీ వాడికి డబ్బులిచ్చి పంపించేశాడు. కారులోంచి దిగగానే అతని కళ్లు చెమర్చాయి. ఒక్కసారిగా భావోద్రేకానికి గురయ్యాడు. ఏటి యివతల ఒడ్డు నుంచి తన ఊరు దూరంగా కనిపిస్తోంది. తను పుట్టి పెరిగిన పల్లె, తను బాల్యం గడిపిన ఊరు... ఏరు శబ్దం చేస్తూ పారుతోంది. ఎన్నో సాయంత్రాలు ఈ ఏటిగట్టునే ఆడుకునేవాళ్లు తామందరం... అందమైన నీలాకాశం, తెల్లని కొంగలు దూరంగా ఎగురుతున్నాయి. చల్లని ఏటిగాలి పడవ అవతలిగట్టుకి వెళ్లినట్లుంది. జనాలు దానికోసం వేచివున్నారు.

ఈ ఏటిగట్టునే తామందరం కబాడీ ఆడేవాళ్లు. ఓడిపోతే ఆ రోజంతా ఒకరితో ఒకరు మాట్లాడుకునేవాళ్లు కారు. మర్నాడు గెలిచేదాకా ఆ ఆవేశం అలాగే వుండేది. ఈ ఏట్లోనే ఎన్నో సాయంత్రాలు ఈతకొట్టేవాళ్లు తామందరూ



అద్దేపల్లి 'సప్తతిపూర్తి' ముగింపు సందర్భంగా త్యాగరాయగానసభ, హైదరాబాద్‌లో కవిసమయం ఏర్పాటుచేసిన సభలో సత్కరిస్తున్న సి. నారాయణరెడ్డి. చిత్రంలో రఘుశ్రీ, సోమయాజులు, నోముల, ద్వానాశాస్త్రి, తాళ్లపల్లి మురళీధరగౌడ్, కళా వేంకటదీక్షితులు.

యింటి దగ్గర తెలియకుండా. తరువాత తెలిసిపోతే తిట్లపురాణం... అంత అందమైన ఆనందమైన రోజులు మళ్లీ వస్తాయా!?

ఎవరో జనంలోంచి భాస్కరాన్ని గుర్తుపట్టినట్టున్నారు. దగ్గరకొచ్చి "బాబూ! తమరు ప్రెసిడెంట్ గారబ్బాయి కదూ!?" అని అడిగాడొక రైతు.

"అవును"

"అబ్బ! తమర్ని చూసి చాలా సంవత్సరాలైంది బాబూ! బాగా మారిపోయారు తమరు. ఎక్కడో అమెరికాకి వెళ్లిపోయారట కదా!"

"అదేంటి బాబూ! ఊర్లోకి కారు డైరెక్ట్‌గా వెళ్లిపోద్ది కదా! యిక్కడ దిగారేటి?" ప్రశ్నలమీద ప్రశ్నలు... భాస్కరానికి యేవేం వినిపించటం లేదు. ఆవలిగట్టున వున్న పడవపైనే అతని చూపులు. అందరికీ ఓపిగ్గా సమాధానాలు చెప్పి కొంచెం దూరం వెళ్లి నిలుచున్నాడు. పడవ తిరుగు ప్రయాణం అయినట్లుంది. దాని తెర చాప దూరం నుంచి కనిపిస్తోంది.

దూరంగా సాయం సంధ్య ఆకాశం, నది కలిసేచోట ఎర్రటి కిరణాలు మెరుస్తున్నాయి. మెల్లగా అలలకి ఊగుతూ వస్తోంది. ఆ నావ రాగానే సూరయ్యని అన్నీ విషయాలు అడగాలి. రాజు చదువు పూర్తయి ఏం చేస్తున్నాడో? ఎక్కడున్నాడో? శేషు, విష్ణు వీళ్లందరూ ఎక్కడున్నారు? రాజు ఎక్కడున్నా పిలిపించుకోవాలి?

రాను రాను పడవ దగ్గరకు రాసాగింది. తీరం చేరింది. జనాల గోల... దిగుతున్న వాళ్లు, వాళ్లని దిగనియ్యకుండా ఎక్కుతున్న వాళ్లు... ఒకరినొకరు పలకరింపులతో హోరెత్తిపోతోంది. భాస్కరం కళ్లు సూరయ్య గురించి చూస్తున్నాయ్. కానీ సూరయ్య జాడ కనిపించలేదు. భాస్కరానికి ఆశ్చర్యమేసింది కొంపతీసి ఈ పడవ సూరయ్యది కాదా! లేకపోతే కొత్త పడవలొచ్చాయా?! అనుకుంటూ వుండగా లీలా మాత్రంగా ఆ మనిషి కనబడ్డాడు. అతనేమో పడవకి లంగరు వేస్తున్నాడు. భాస్కరం అతని దగ్గరకెళ్లాడు. అతను చూడబోతే రాజులా వున్నాడు. భాస్కరం తన కళ్లను తానే నమ్మలేకపోయాడు "నువ్వు రాజువి కదూ!?" తడబడుతూ అడిగాడు.

"అవును,... నువ్వు నువ్వు భాస్కరానివి కదూ?!"

యిద్దరూ ఒకేసారి ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. కొద్ది నిమిషాల తరువాత భాస్కరం అడిగాడు.

"ఏమిట్రా! నువ్వు పడవ నడుపుతున్నావ్? మీ నాన్న ఏమయ్యాడు? అసలు నీ చదువు ఏమైంది? చెప్పరా? చెప్పు" అతన్ని కుదిపేస్తూ అన్నాడు. రాజు మౌనంగా చూస్తుండిపోయాడు. దూరంగా ఏటిగట్టున యిద్దరూ కూర్చున్నారు. రాజు చెప్పసాగాడు.

నీకు తెలుసుగదా నువ్వు అమెరికా వెళ్లే ముందు మాకున్న ఎకరం పొలం అమ్మేసి ఇంజనీరింగ్‌లో జాయిన్ అయ్యాను. నా చదువు పూర్తయి మంచి ఉద్యోగం వస్తే తన కష్టాలు తీరిపోతాయని అనుకున్నాడు మా నాన్న. కానీ, నేను రెండో సంవత్సరంలో వుండగా, ఏటికి ఉధృతమైన వరద రావడంతో పడవతో సహా మునిగిపోయాడు. ఆ ప్రమాదంలో మా నాన్నతో సహా పదిమంది చనిపోయారు కూడా. తరువాత రెండు రోజులకి మానాన్న శవం ఐదు కిలోమీటర్ల దూరంలో ఒడ్డుకి చేరింది. ఈ వార్త నాకు ఆశనిపాతంలా తగిలింది. ముందా వార్త విని నమ్మలేకపోయాను. యింటికి చేరేటప్పటికే

అన్నీ జరిగిపోయాయి. నాన్న చనిపోవడంతో మా యింటి పరిస్థితి మరీ దయనీయంగా మారింది. నాన్న బ్రతికున్నప్పుడు సంవత్సరాని కింతని ఆదాయం వచ్చేది.

యిల్లు ఎలాగోలా గడిచిపోయేది. కానీ, యిప్పటి పరిస్థితి వేరు. యింకా యిద్దరు చెల్లెళ్లు, అక్క, తమ్ముడు వీళ్లందర్నీ పోషించాలి. చదివించాలి. ఆ ఉన్న ఒక్కగానొక్క ఆధారం పడవ... అది గూడా పోయింది. నేనింకా రెండేళ్లు పైగా చదవాలి. అది చాలా కష్టం... తీవ్రంగా ఆలోచించాను. ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాను. వీళ్లందరికీ తనే ఆధారం... వీళ్లందర్నీ తనే పోషించాలి. ఈ కుటుంబాన్ని కాపాడాలి. అందుకే ఎందరు చెప్పినా చదువు మానెయ్యాలని నిశ్చయించుకున్నాను. కొత్త పడవను తయారుచేసి ఊరివాళ్ల సహకారంతో ముఖ్యంగా మీ నాన్నగారి చలవ వల్ల యిలా నడుపుతున్నాను.

అది విన్న భాస్కరం గుండె తరుక్కు పోయింది. "ఒరేయ్! అంత తెలివైన వాడివి... జిల్లాకు ఫస్టొచ్చిన వాడివి. ఈ పని ఎన్నాళ్లు చేస్తావురా! నీ భవిష్యత్తు..." బాధతో అన్నాడు భాస్కరం.

"చూడు భాస్కరం! యింకేం చదువు... ఈ విషయంలో నేనూ, మా నాన్న ఒక్కటే. నేనెంత ఎదగాలనుకున్నా ఈ సమస్యలు ఎదగనివ్వ లేదు. దీనికి కారణం ఏమిటో తెలుసా?! పేదరికం... ఈ పేదరికం వల్లే మా నాన్న చదువుకోలేదు... ఆ నిరక్షరాస్యత వల్లే యింతమందిని కన్నాడు. వాళ్లందర్నీ ఎలా పోషించాలని మా నాన్న ఎప్పుడూ ఆలోచించి వుండడు! యిక చదువు, ఉద్యోగం, ఎదుగుదల అంటావా! అవన్నీ నా దృష్టిలో డబ్బున్నవాళ్లకే. యిదేమీ నేను ఈర్ష్యతో చెబుతున్న మాటలు కావు. పచ్చి నిజం. సర్లే. ఈ విషయాలు యిక వదిలెయ్యి.

> ## గమనిక
>
> సాహిత్య కార్యక్రమాల ఫొటోలు ప్రచురణార్థం పంపించేటపుడు ఆ కార్యక్రమం జరిగిన తేది, స్థలం తప్పక ఉదహరించాలి. ఈ వివరాలు లేకుండా వచ్చే ఫొటోలు ప్రచురణకు స్వీకరించబడవని గమనించగోర్తాం.
>
> – ఎడిటర్

నీ విషయాలు చెప్పు" అంటూ... పదపద... జనాలు గోల చేస్తున్నారు. పడవని నడుపుతూ మాట్లాడుకుందాం" అంటూ రాజు భాస్కరం లగేజీని పట్టుకుని పడవ దగ్గరకి దారితీశాడు. లంగరు విప్పి పడవని నడపసాగాడు.

పడమటి సంధ్య ఎర్రబారుతోంది. సూరీడు పశ్చిమాద్రికి కృంగిపోతున్నాడు.

గోధూళి వేళ కావడంతో అందరూ యింటి బాట పడుతున్నారు. భాస్కరానికి పదేపదే రాజు అన్న మాటలు గుర్తుకొస్తున్నాయి. "ఈ దేశంలో చదువు, ఉద్యోగాలు డబ్బున్న వాళ్లకే...". నిజమే... ఈ రిజర్వేషన్‌లు, ప్రభుత్వం యిచ్చే రాయితీలూ యివన్నీ సరియైనవారికి చేరటం లేదు. ఎందరో తెలివైన పేదవాళ్లు ప్రతిభ వున్నా కనుమరుగైపోతున్నారు. భాస్కరానికి రాజుని చూస్తే జాలి కలుగుతోంది.

పడవ నదిలో మెల్లగా సాగిపోతోంది. దూరంగా పడవలోంచి సరంగు పాడుతున్న పాట వినిపిస్తోంది. అలల్లోంచి అస్తమిస్తున్న సూర్యబింబం ఎర్రగా కనిపిస్తోంది. రాజు పడవని జాగ్రత్తగా నడుపుతున్నాడు. ఆ సూర్య బింబం రాజు నుదుట సింధూరంలా మెరుస్తోంది. భాస్కరానికి మునుపటి ఉత్సాహంలేదు. పడవ ఆవలి ఒడ్డుకి సాగిపోతోంది... ●